


అన్నట్టు మీరు విన్నారో లేదోగాని దెబ్బకి ఠంగై యూరుకున్నాడంత పెద్దస్టారూను.... నమస్తేసార్ నమస్తే ఏంజేస్తాం నలుగురితోపాటే నారాయణా అన్నారు షురి. నాకు పట్టుబడుతోంది నమస్తే లాంగ్వేజి—ఏమిటీ పబ్లికు మీటింగా! లేటెస్టు కళాఖండం తీసినాయనకి సన్మానమ్మాటేనా మీరనేది. ఇక్కడే. ఇదిగాదూ మీటింగూ? అదిగో ఆ పవరుహావుసు దగ్గిర్నించి ఈ చివర్న పార్కు దాకా పాండీబజారు పొడుగునా తురాయిచెట్లకింద జరిగేది బహిరంగసభ గాపోతే మరేవిటనుకున్నారు. అలా నవ్వుతారేం సార్. ఇదంతా ఒహటేసభ. మీకు తెలీందేవుంది.

విశ్వగుణాదర్శపువా డన్నట్టు తెలుగువాడు శాస్త్ర సంద డయిన మనిషి గదండీ. పెద్దసభ పెడితే ఏడజనుమందో మాటాడిందికి వసతుంటుంది. మిగతా ఐదొందలమందీ కూడా మాటాడదల్చుకున్న వాళ్ళేగదా. అందుకని లేటెస్ట్ ఫాషనేవిటంటే ఆయొక్క పెద్దసభకి నూరు బ్రాంచీలు ఏర్పాటు చేసి పదెకరాల బజార్లో నూరు చిన్న మీటింగులు పెట్టుకోడం. ఒహొక్కదాంటో ఐదారుగురుంటారు. చక్కగా అంథా ఒక్కమారే మాటాడుకోవచ్చు. అదే రైటంటాను నేను. ఒహడు చెప్పే దేవిటండీ మనకి. ఆ మాత్రం మనవూఁ చెప్పగలవుఁ. అంచేత మీదయ. మీ చిత్తం. ఈరోజ్జు పొడుఘూనా సాగుతున్న నూటొక్క సభ ల్లోనూ మీ మాటొక్కటే చెల్లుతుందని గారంటీ కనిపించిన ఎందులోకైనా వెళ్ళవచ్చు. అంతా ఒకటే నన్నాడు కవి. కోటినదులు—— అనిన్నీ అన్నాడు. వినడంమాత్రం పని పెట్టుకుంటే ఇక్కడే నిలబడొచ్చు. పక్కదాంటో మీ స్పీచికి పాయింట్లు తక్కువైనా, మోసింది కేఁపీ లేక ఒళ్లు తేలిపోతున్నాకూడా ఇక్కడే నిలబడొచ్చు. విషయాలు నచ్చకపోతే చేతికొచ్చినవేషం చెయిజారినవాడిలా మొహం ముడుచుకూర్చోవచ్చు.

ఆహా, కళాఖండంగురించే మాటాడుకుంటున్నాం. ఏదో మీకు తెలుసుగా. మనకి మామూలుగా ఏడాదికి పాతిక పిక్చర్లొస్తే నాటిలో మూడు హిట్లయి, మరో మూడిటికి పెట్టిండబ్బొస్తే మిగతావి వెరసి మొత్తం పఝ్ఝెనిమిది

కళాఖండాల్తేలాయి. అందులో ఏది అన్నది తెలుసుకుంటే మంచిది. సంగతులు బాగా బోధపడతాయి.

* * *

మొత్తానికి మహామంచి పన్జరిగిందిలెండి. లేపోతేఏవిటీటా కొత్త. పీడి బోడికొత్తా వీడూను. ఇన్నాళ్ళాయి దీన్ని కని బెట్టుకూర్చున్న జేజెమ్మల్లాంటివాళ్ళ కొరుకుడు పళ్ళేదు టెలుగూ ఆడియన్సుక్కావలసిందేవిటో. పెద్దపెద్ద జైంట్లు డీడిక్కులు కొట్టుకుంటున్నారు. ప్రాచీన సంప్రదాయాల్ని బూజుపోకుండా కాపాడుకొస్తున్నవాళ్ళు వాటిని ఎంత జూసినా తరణోపాయం ఏవిటో పట్టుగోలేపోతున్నారు. మజ్ఝన వీడొచ్చినావళ్లీతో ఫిలింఫీల్డుని చెరిగవతల పారేస్తానంటే యలా. మజాకానా. అన్నీ కొత్తపద్ధతులు పట్టుగొచ్చి రుద్దేస్తానండానికి వీడేం రాజారామ్మోహన్రాయా వీరేశలింగం పంతులా. మహామహా వాళ్ళకే దిక్కులేదు. సత్యజిత్రాయికి దిక్కుందా—సీమదొర్లు విరగబడి వ్రాసి ఊహు ప్రయిజులు గుప్పించేదాకా.

వీడు ముల్లంగిదుంపలా వచ్చేసి, సిసింద్రీలా ఒక్కమారు గోల్చేసి నెగ్గేసి పిక్చర్ని హిట్ చేసుకుంటే ఉన్నవాళ్ళకి ఇన్సల్టుకాదూ. అక్కడికి వీళ్ళంతా వఠ్ఠి చెవలాయలూ, వీళ్ళ బుర్రలు చవిటిపర్రలూ అయినట్టుగానూ. సెల్ఫు రెస్పెక్టున్నవాడు ఎవడు సహిస్తాడండీ...

ఏమిటో సెలవిస్తున్నారు మీ పక్కాయన చెవిలో. నాది పావుచెవుల్లెండి. ఔను ఒప్పుకుంటాను. నేవంటా ఆ

పిక్చర్లో పనిజేసి డబ్బుచ్చుకున్నవాళ్ళవే... లేపోతే పుచ్చుకుందావని ఆశపడ్డవాళ్ళవే గావచ్చు. అయితేమటుకు పుచ్చుకున్న మేరకి మెచ్చుగున్నాంగా పిక్చరు తీస్తున్నపుడు ...మరి మా మాటిలా అయితే ఏవీ సంబంధం లేక పోయినా శక్తివంచన లేకుండా షూటింగులు కాన్సిలు చేసుకు మరీ ఉహూ ఉప్పొంగిపోతున్న ఇతర మోతుబర్ల మాటేవిటిటా. వాళ్ళంతా పొగరు మోతుబర్లనేనా మీ తాత్పర్యం. వాళ్ళ ఆనందం అంతా అబద్ధవనేనా?

ఏమోలెండి. మీరు బిక్కమొహం పెడితే ఇందాక వొచ్చినాయన పార్టీయేమో అనుకున్నాను. ఆయన ధువ ధువలాడిపోయాళ్లెండి. నోమాన్ ఈజె నైలెండన్నాళ్లెండి. ఈ భూ ప్రపంచకంలో ఎక్కడ ఏ జీవి చచ్చినా, కాస్త చెక్కు లేచినా మిగతా చరాచర జీవకోటి అంతటా ప్రతి ప్రాణిలోనూ ఒక జీవకణం చచ్చిపోతుందనిన్నీ, అందువల్ల ఎక్కడో చర్చిలో గంటమోగితే ఎక్కడో హరహరా అంటూ పల్లకీ లేస్తే ఎవడో పోయుంటాడనుకోరాదుట.

మనలో ఒక అణువు మరణించిందనటానికి భోర్న యాడవాలిట. మనందరిదీ కలిపి ఒక మహాశరీరంట.... అయ్యా ఇదీ వరస. ఆయన్చెప్పొచ్చిందల్లా ఇదే. ఒక పిక్చరు కళాఖండవై పోయిందని మనం ఆనందపడ్డం ఏవీ బాగులేదుష. ఒక ప్రొడ్యూసరు జై పరమేశ్వరా అంటూ జెండా ఎత్తేస్తున్నందుకు చప్పట్లు కొట్టి పార్టీలు ఇచ్చుకో కూడదుట. ఇండస్ట్రీలో ఏ ప్రొడ్యూసరు దెబ్బతిన్నా ఆనష్టం అందరికీ తగుల్తుందిట. ఇండస్ట్రీలో తీస్తున్న పిక్చ

ర్లన్నీ ఒక్కటే మహాపిక్చరుట. (కథా కమామిషుల విషయంలో ఈముక్క రైట్ అనుకోండి) అంచేతఒక పిక్చరు దెబ్బతింటే అది మిగతా పిక్చర్లన్నిటికీనుట. ఒక ప్రొడ్యూ సరికి చిరాకేసి వెళ్ళిపోతే పరిశ్రమకి లోటుట. ఇంక కొత్త వాళ్ళు రారని భయపడాలి. అంచేత మనం ఇలా క్రూరంగా మనిషి పేర్లమీదా పిక్చరు పేర్లమీద చవటజోకులు వేస్తూ నిద్రాహారాలు మానేసి హేళన సప్తాహోరాత్రులు చేస్తూ కూచోడం సిగ్గుచేటూట, మనం బాధపడాల్ట.

బాధెందుకంటే, నాకు తెలీకడుగుతాగాని, మంచిదేగా ఈ వెర్రిమొర్రి మనుషులొచ్చి పిచ్చిపిచ్చి పోకిళ్ళుపోతే— అవి హిట్లయి వాటికి పతకాలూ గట్రా వచ్చి పేట్రేగి పోతే కొంపలు మునిగిపోవుటండి. సనాతన భారతీయ చిత్ర సంప్రదాయం సంక్షుభితం అయిపోదుషండీ. ఏవిటంటా వీళ్ళు. వీళ్ల కొత్తాను. సృష్టిలో ఏది కొత్తగా ఉంటుంది. సూర్యోదయం తీసుకోండి. నే జూసినంతలో నా చిన్నప్ప ట్నించి ఒక్కడే సూర్యుడు మొహం చూపిస్తున్నాడు. అదే మొహం ఎన్నాళ్లు చూసినా. ఎపుడేనా మొహానికింత కొత్తరకం మబ్బు పూసుకుంటాడు, తప్ప. ఇహపోతే వాడు చేసేపని ఉదయించడం, అస్తమించడం. అంతే గదా? ఎన్నాళ్లయినా తూర్పునే ఉదయిస్తాడుగదా! పువ్వులు పరిమళమే గుబాళిస్తాయితప్ప గ్రాంఫోను పాటలు పాడవుగదా. రామాయణం ఎన్నిసార్లు ఎందరువ్రాసినా రావణుడు సీతను ఎత్తుకుపోతాడుతప్ప కైకనో, కౌసల్యనో మంథరనో వెరైటీకేనా ఎత్తుకుపోడుగదా. రాముడు

రావణాసురుణ్ని చంపుతాడుతప్ప విభీషణుడిని ఖూనీచేయడు గదా. అప్పారావు అప్పుచేస్తాడేతప్ప ఇవ్వడుకదా. మీరు బలవంతాన కాఫీ యిస్తారేతప్ప.నాచేత పుచ్చుకోరుగదా. మనవంతా కొత్త పాద్యూసర్లని, పిక్చర్లని ఎత్తిపొడుస్తావే తప్ప పైకెత్తి ఓహో అనిగాని అయ్యో అనిగాని అనంగదా. అలాటపుడు తెలుగుసినిమా కాంపోజిషన్ మటుకు ఎందుకు మారాలి అంట. చెప్పండీ. మాటాడ్రేం, డైలాగు మర్చి పోయిన కారెక్టర్లా, పోర్షనయిపోయిన పరంధామయ్యలా మాటాడ్రేం!

